క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు



మాట్లాడుతున్న అధ్యాపకుడు నాగేశ్వరరెడ్డి

బనగానపల్లె: జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల వాణిజ్య అధ్యాపకుడు నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న 5,12,18,24 శాతం ఉన్న జీఎస్టీ స్లాబులను కేంద్రం తగ్గించిందని తెలిపారు. ఫలితంగా వ్యవసాయ పరికరాలు, నోటుపుస్తకాలు, యంత్ర పరికరాలు మరెన్నో వస్తువుల ధరలు తగ్గినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆనందరావు, కృష్ణుడు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ జాతర



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో మంగళవారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఏటా దసరా పండుగ తరువాత జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి నైవేద్యం తయారు చేసి, బోనాలను చౌడేశ్వరిదేవికి సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు చేశారు.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

బేతంచెర్ల: జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగుతుందని ఎంఈఓ–2 అబ్రహ్మం అన్నారు. మంగళవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూలో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశావర్కర్ల వినతి



పీహెచ్‌సీలో వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ప్యాపిలి: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ చిన్న రహిమాన్, సహాయ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం జలదుర్గం పీహెచ్‌సీలో ఇన్‌చార్జి మాధవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా ఆశా వర్కర్ల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. చాలీచాలని వేతనాలతోనే ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. సూపర్‌వైజర్ షమీ ముల్లా, కేవీపీఎస్ నాయకులు రాజ్‌కుమార్, ప్రతాప్, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, కృష్ణకుమారి, దేవమ్మ, పీరాంబీ, కవిత, కమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సభను విజయవంతం చేద్దాం



నొస్సంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజామల: నంద్యాలలో ఈనెల 12వ తేదీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు చింతమాను పెద్దన్న మాదిగ, శివరాముడు అన్నారు. మండల పరిధిలోని నొస్సం గ్రామంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని మాదిగ కులస్తుల పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

10 నుంచి బోధనేతర యాప్‌ల బహిష్కరణ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10వతేదీ నుంచి ఉపాధ్యాయులకు సంబంధించిన బోధనేతర యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి,నగరి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన యాప్‌లు తప్ప మిగిలిన అన్నింటిని ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయుల డీఎలు, 12వ పీఆర్సీ, ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో ఫ్యాప్టో జేఏసీ భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధమని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయవాడలో జరిగిన ఫ్యాప్టో రాష్ట్రస్థాయి పోరుబాట కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిందన్నారు.

లబ్ధిదారులకు స్మార్ట్ కష్టాలు

- గందరగోళంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- కార్డుల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- గంటల తరబడి పడిగాపులు
- వలంటీర్లు ఉంటే కష్టాలు తప్పేవంటున్న కార్డుదారులు



ప్యాపిలి-1 సచివాలయంలో స్మార్ట్‌కార్డుల కోసం వచ్చిన లబ్ధిదారులు

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం పాత రైస్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తోంది. అయితే కార్డుల పంపిణీ మాత్రం ఓ ప్రహసనంలా మారింది. కొందరు గతంలో ఉన్న అడ్రెస్‌లో కాకుండా వేరేచోటు ఉండడం.. ప్రస్తుతం నివాసం ఉంటున్న చోట హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసుకోవడంతో తమ కార్డు ఎక్కడ ఉందో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ప్యాపిలి మండలానికి 22,690 స్మార్ట్ కార్డులు ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ కార్డులను తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకెళ్లిన వీఆర్‌ఓలు సచివాలయం సిబ్బందికి ఇచ్చారు. సచివాలయం సిబ్బంది వాటిని నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయాలి. స్మార్ట్ కార్డులు అందజేసే ముందు ఐరిష్ లేదా బయోమెట్రిక్ తీసుకోవాలి. తర్వాత లబ్ధిదారుడి మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పిన తర్వాత స్మార్ట్ కార్డులు అందజేయాలి. అయితే కార్డుల పంపిణీ విషయంలో సచివాలయ సిబ్బంది చేతులెత్తేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా సచివాలయంలోనే పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో వందలాది మంది లబ్ధిదారులు సచివాలయాలకు తరలివచ్చి తమ కార్డు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో స్మార్టు కార్డు పంపిణీ చేయాలంటే ఐరిష్, బయోమెట్రిక్, ఓటీపీ తదితర ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం 30 నిమిషాల సమయం పడుతోంది. ఫలితంగా లబ్ధిదారులు గంటల తరబడి సచివాలయాల్లో పడిగాపులు కాస్తున్నారు.

వలంటీర్లు ఉంటే ఒక్క రోజులో పూర్తయ్యేది

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఒక్కో వలంటీర్ తన పరిధిలో ఉన్న 50 కుటుంబాల వారిని నేరుగా కలిసి వారికి ప్రభుత్వం తరఫున అందాల్సిన సేవలను పూర్తి చేసేవారు. వలంటీర్లకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున అప్పటి ప్రభుత్వం ఠంఛన్‌గా గౌరవవేతనం ఇచ్చింది. అయితే అడ్డగోలు హామీలతో అధికారంలోకి రావడాన్ని అలవాటు చేసుకున్న చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10 వేలు గౌరవ వేతనం ఇస్తామని భూటకపు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు వలంటీర్ల వ్యవస్థే లేదని నాలిక మడతెట్టేశారు. దీంతో వలంటీర్లు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న స్మార్ట్ కార్డుల పంపిణీలో తమకు కలుగుతున్న ఇబ్బందులను చూసి ప్రజలు వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము సచివాలయాలకు వచ్చిన సందర్భాలే లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వలంటీర్ పేరు చెబితేనే బయోమెట్రిక్

ఓ వైపు సచివాలయ వ్యవస్థే లేదని బుకాయిస్తున్న కూటమి ప్రభుత్వం.. అదే వలంటీర్ల పేరు చెప్పనిదే ప్రజలకు సేవలు అందించలేని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్యాపిలి–1 సచివాలయంలో సచివాలయ సిబ్బంది స్మార్టు కార్డులను ఓ టేబుల్‌పై ఉంచారు. తమ కార్డును ప్రజలే వెతికి తీసుకుని సచివాలయం సిబ్బంది వద్దకు వెళ్తున్నారు. తమ పూర్వ వలంటీర్ పేరు చెప్పిన తర్వాతనే దాని ఆధారంగా సచివాలయం ఉద్యోగులు లబ్ధిదారుల షాపు నంబర్, ఇతర వివరాలను ధృవీకరించుకుని బయోమెట్రిక్ తీసుకుంటున్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరు

కొలిమిగుండ్ల: రబీ సీజన్ కోసం మండలానికి 1800 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరైనట్లు ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ మంగళవారం తెలిపారు. క్వింటా రూ.7800 కాగా 25 శాతం సబ్సిడీతో రైతులకు రూ.5850కే సరఫరా చేస్తామని చెప్పారు. ఐదు ఎకరాల వరకు పది ప్యాకెట్ల చొప్పున అందిస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, మొబైల్, పస్‌బీ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బుధవారం నుంచి ప్రతి రోజు సాయంత్రం 4 గంటల తర్వాత ఆర్‌ఎస్‌కెల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలానికి అదనంగా 1200 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపామన్నారు.

పార్కు రుసుం వసూలుకు వేలం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని కుందూనది సమీపంలో ఉన్న పార్కుకు సంబంధించి రుసుం వసూలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. వేలం దక్కించుకున్న వ్యక్తులకు ఏడాది కాలం పాటు రుసుం వసూలుకు హక్కు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 10వ తేదీ స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ. 50 వేలు ప్రాథమిక ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

డోన్ మున్సిపాలిటీకి అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డోన్ మున్సిపాలిటీకి జిల్లాస్థాయి అవార్డు లభించింది. నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి చేతులమీదుగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ 'బెస్ట్ మున్సిపల్ ఆఫీస్ బిల్డింగ్ (వెల్ మెయింటనెన్స్) అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అందించిన సహకారమే ఈ పురస్కారానికి కారణమని తెలిపారు. పట్టణంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రి, ఆధునిక మున్సిపల్ కార్యాలయం, కూరగాయల మార్కెట్, క్లబ్ హౌస్, ఇండోర్ స్టేడియం, అర్బన్ హెల్త్ సెంటర్ల వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టడం డోన్‌కు గౌరవం తెచ్చిందని అన్నారు.

ఆదాయ పెంపుపై దృష్టి సారించాలి



బనగానపల్లెలో మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

బనగానపల్లె రూరల్: ప్రతి గ్రామ పంచాయతీ సొంత వనరుల ద్వారా ఆదాయం పెంచుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కృషి చేయాలని ఏఈ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో ఆర్‌బీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక–2025–26 భాగంగా గ్రామ పంచాయతీ సొంత వనరుల ఆదాయాలపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు రెండు రోజుల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ నాగరాజు మాట్లాడుతూ.. పంచాయతీల్లో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను, లైసెన్స్‌లు వంటి వనరుల ద్వారా ఆదాయాన్ని పెంచే మార్గాలపై మాస్టర్ ట్రైనర్లు మహేశ్వరయ్య, వేదవతి అవగాహన కల్పించారు.

గ్రామాభివృద్ధికి ప్రజా భాగస్వామ్యం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ,



జీఎస్టీ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు

బేతంచెర్ల: మండలంలోని గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి, ఆదాయ వనరుల సమీకరణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామాల్లో ఇంటి పన్నులు, పంక్షన్ హాల్స్, వ్యాపార సముదాయాలు, పరిశ్రమలపై పన్నులు వసూలు చేసే విధానంపై ట్రైనర్లు శివనాగయ్య, మహేష్‌లు అవగాహన కల్పించారు. అనంతరం జీఎస్టీ మార్పులు, వస్తువుల ధరల్లో తగ్గింపులపై వివరాలు ఉన్న కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దస్తగిరి బాబు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటకు చెందిన వివాహిత మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెలుంకు చెందిన స్వాతికి తుమ్మలపెంటకు చెందిన పల్లె యేసుదాసుతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన స్వాతి మంగళవారం ఉదయం రంగుల్లో కలిపే టిన్నర్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎక్కువ భాగం కాలిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సీఐ రమేష్‌బాబుతో కలిసి తుమ్మలపెంటకు చేరుకుని స్వాతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై విచారణ చేశారు.

మదనంతపురంలో చోరీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మదనంతపురంలో మంగళవారం పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన అంబటి జనార్దనరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బందార్లపల్లె రోడ్డులో ఉన్న పొలంలో టమాట పంట కోత కోసేందుకు వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి చేరుకునే సరికి ప్రధాన ద్వారం తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారంతో పాటు సుమారు రూ.10వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దుండగులు ప్రధాన ద్వారానికి వేసిన తాళం ఉండగానే చాకచక్యంగా తీసి లోపలికి ప్రవేశించారు. ప్రధాన రహదారి సమీపంలో లోపల ఇళ్లు ఉండడంతో పాటు చుట్టు పక్కల వాళ్లు ఎవరూ లేకపోవడంతో దొంగలకు చోరీ చేసేందుకు సులభతరమైంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

గోర్లగుట్టలో చిరుత సంచారం?

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట చెలిమ వద్ద చిరుత కనిపించినట్లు వాహనదారులు తెలిపారు. బనగానపల్లె నుంచి కర్నూలుకు వెళ్లే మార్గంలో రోడ్డు దాటుతూ చిరుత కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్ బాబుకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రమేష్ బాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



బనగానపల్లె: మాట్లాడుతున్న మాలమహానాడు నేత దస్తగిరి



డోన్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



డోన్‌లో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోవెలకుంట్ల/డోన్ టౌన్/బనగానపల్లె రూరల్/బేతంచెర్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై రాకేశ్ కిశోర్ అనే న్యాయవాది చెప్పులు విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కోవెలకుంట్లలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరుణాకర్‌రావు, లక్ష్మీనరసింహుడు మాట్లాడుతూ.. ఈ ఘటన మొత్తం న్యాయవ్యవస్థపైనే దాడి అని, నిందితుడిని బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డోన్‌లో సీపీఎం నేతలు నక్కి శ్రీకాంత్, రహిమాన్, షమీమ్‌బేగం తదితరులు మాట్లాడుతూ.. దళిత వర్గానికి చెందిన ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాద శక్తులు కుట్రపన్నాయని, కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బనగానపల్లెలో మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు దస్తగిరి ఈ దాడిని రాజ్యాంగంపై దాడిగా పేర్కొని బాధ్యులపై కఠిన శిక్ష తీసుకోవాలని కోరారు. బేతంచెర్లలో దళిత సంఘాల నాయకులు నాగరాజు, రాజయ్య, శివ తదితరులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. సర్వోన్నత న్యాయమూర్తికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

- **డోన్ టౌన్/ప్యాపిలి:** దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా భావించాలని, నిందితుడిపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు అన్నారు. దాడిని ఖండిస్తూ మంగళవారం డోన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు వేణుగోపాల్‌గౌడ్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, మధుసూదనగౌడ్, మద్దయ్య, శ్రీరాములు, రంగారెడ్డి,, సుగాలి, అనంద్ తదితరులు ఉన్నారు. ప్యాపిలిలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాధాకృష్ణ దాడిని ఖండించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం నాయకులతో కలిసి రామకృష్ణాపురం గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులు కష్టపడి పంటలను పండిస్తున్నా వాటిని అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుందని.. అనుకున్నంత దిగుబడి రాలేదన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు క్వింటా రూ.2400 ప్రకటించిందే తప్ప, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు సంఘం నాయకులు గోపాల్, వద్దిరాజు, శేఖర్, రాజశేఖర్, కేశవరావు, నాగేంద్ర, గోవిందు, నాగేంద్ర, విజయుడు పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: పూజల్లో పాల్గొన్న వాల్మీకులు



ఎం.పేండేకల్లు గ్రామంలో..



డోన్: నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నేతలు



ప్యాపిలి: వాల్మీకి గుహల వద్ద..



కోవెలకుంట్లలో పూజలు చేస్తున్న మహిళలు

రామాయణ కావ్యం.. మానవాళికి ఆదర్శం

- ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు
- పూజలు చేసిన వివిధ సంఘాల నాయకులు, వాల్మీకులు



బేతంచెర్లలో గ్రామోత్సవం



గూటుపల్లెలో..



డోన్‌లో వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఆకుమల్లలో గ్రామోత్సవం





బనగానపల్లెలో వాల్మీకి సంఘం, విశ్వహిందూ పరిషత్ నాయకులు, బుగ్గానిపల్లెలో..

రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కౌన్సిలర్లు మేకల రాజు, శ్రీధర్, ఆర్ట్ రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి వేర్వేరుగా వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం జిల్లా నాయకులు పవన్‌గోపాల్, శీలం భాస్కర్ నాయుడు, పూల శ్రీను పాల్గొన్నారు. అలాగే నంద్యాల ప్రభుత్వాసుపత్రి డాక్టర్ మాధవకృష్ణ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. న్యాయవాదులు శ్రీరాములు, క్రిష్ణమూర్తి, శివరామకృష్ణ పాల్గొన్నారు. బనగానపల్లెలో విశ్వహిందూ పరిషత్, సామాజిక సమరసత, వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. విశ్వహిందూపరిషత్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో వాల్మీకి చిత్రపటానికి మహిళలు పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. బోయ మద్దిలేటి, కంబగిరి రాముడు పాల్గొన్నారు. బేతంచెర్లలో జరిగిన కార్యక్రమంలో బుగ్గానిపల్లె రాముడు, బ్రహ్మనాయుడు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రమణ పాల్గొన్నారు. కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకి సంఘం నాయకులు పెద్దయ్య, రామ్మూర్తి, కంబగిరి నరసింహులు పాల్గొన్నారు. కోవెలకుంట్లలోని సంతపేట, అమడాల గ్రామాల్లో ఎంవీ సుబ్బయ్య, శంకరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్యాపిలి మండలం మెట్టుపల్లి, ఎన్ రంగాపురం, బోయవాండ్లపల్లి, జలదుర్గం గ్రామాల్లో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. స్థానిక నాయకులు కంబయ్య, లక్ష్మీరంగయ్య, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు. –సాక్షి నెట్‌వర్క్